వెన్నెల పక్షులు

మూలం

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ "స్ట్రే బర్డ్స్"

అనుసృజన

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

తేది. 22-12-2108
నాడు "అక్షరం అస్థిత్వమైన
వేళ" డా॥ కేతవరపు
రాజ్యశ్రీ కవిత్వం
పుస్తకావిష్కరణ.
ఆవిష్కర్త ప్రముఖ కవి
కేంద్ర సాహితీ అకాడమీ
ప్రాంతీయ కన్వీనర్ కె.
శివారెడ్డి, ఫోటోలో రెక్కల
కవి ఎం.కె. సుగమ్‌బాబు,
నియోగి,
డా॥ కేతవరపు రాజ్యశ్రీ

ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం వారు నిర్వహించిన "నెలనెలా తెలుగు వెన్నెల"
సాహితీ కార్యక్రమంలో కేతవరపు రాజ్యశ్రీ రచించిన "వంద ప్రశ్నలు - వేల భావాలు"
పుస్తకావిష్కరణ సభలో అధ్యక్షులు వీర్నపు చినసత్యం, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీమతి
అట్లూరి స్వర్ణ, ఇతర సంఘ సభ్యులు

“వెన్నెల పక్షులు”

మూలం

విశ్వకవి **రవీంద్రనాథ్ టాగూర్**

“స్ట్రే బర్డ్స్”

అనుసృజన

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

"వెన్నెల పక్షులు"

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

ప్రథమ ముద్రణ : మార్చి 2019

వెల : రూ. 101/-

ప్రతులకు :

డా॥ కె. రాజ్యశ్రీ

ప్లాట్ నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్,

స్ట్రీట్ నెం. 4, అశోక్ నగర్, హైదరాబాద్ -500 020.

ఫోన్ : 040-2765 0267, సెల్ : 85001 21990

ఇ-మెయిల్ : rketavarapu@gmail.com

website : **www.rajyasri.com**

డి.టి.పి. :

టి. రాజేంద్రప్రసాద్

ముద్రణ :

అక్షయ గ్రాఫిక్స్

చిక్కడపల్లి, హైదరాబాద్.

సెల్ : **9989890588**

ఇ-మెయిల్ : rajendratammisetty1@gmail.com

అంకితం



విశ్వకవి

రవీంద్రనాథ్ టాగూర్

దివ్య స్మృతికి...

పద్మశ్రీ డా॥ కొలకలూరి ఇనాక్
పూర్వ ఉపాధ్యక్షులు :
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం

అభినందన

చాలా కాలానికి మళ్లీ విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ కవిత్వం చదివే అదృష్టం కలిగించిన డా॥ రాజ్యశ్రీకి అభినందనలు.

టాగూర్ గీతాంజలిని చదివిన పాఠకులెవరూ ఆ రచనలోని అందాన్నీ, సంగీతాన్నీ, అలౌకిక ప్రపంచాన్నీ విస్మరించలేరు. ఆ కారణంగానే నోబెల్ బహుమతికి ఆ గ్రంథం అర్హమై ప్రపంచవ్యాప్త కీర్తి గడించింది.

రవీంద్రనాథ్ టాగూర్ రచించిన "స్ట్రే బర్డ్స్" లఘు కవితలను అనువదించిన డా॥ రాజ్యశ్రీ కృషి ప్రశంసనీయం.

ప్రేమ, సౌందర్య, దాని తాదాత్మ్యం, ఔన్నత్యం ప్రదర్శించే టాగూర్ లఘుకవితల స్ఫూర్తి కావ్యమంతా కన్పిస్తుంది.

"ఓ చిరుగడ్డీ!
నీ పాదాలు చాలా చిన్నవి
కానీ
ఈ భూమిని నీ కాళ్ళ కింద
తొక్కి పెట్టావు' –

ఎంత సుందరమైన భావన అది భూమిని తొక్కిపట్టిన వ్రేళ్ళన్నమాట! బాగుంది.

"రుచిగా లేదని
భోజనానికి వంకపెట్టకు
ఎందుకంటే
నీకు ఆకలి లేదు"

ఇటువంటి భావాలు టాగూరులో తక్కువ. రచయిత్రిలో ఎక్కువ. 'రుచి' అంటే అందమని, ఆకలి అంటే 'వాంఛ' అని గ్రహిస్తే, కురూప యువతికి కూడా పెళ్ళి అవుతుందని అర్థమవుతుంది.

అసలు కురూపం, సురూపం అనకుండా యౌవనం అంటే సరిపోతుంది కదా!

గడ్డి సమూహంగా, చెట్టు ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడు తుందట. మనిషికి ప్రశ్న. మనిషి బ్రతకటం గడ్డిలాగానా? చెట్టులాగానా? ఎలా అయినా ప్రపంచం సుందర ఉద్యానవనం కాదూ?

'దేవుడా!
ఇది నా జీవిత చరమాంకపు మాట
నేను నీ ప్రేమను
నమ్ముతున్నాను'
అనుభవానికీ, నమ్మకానికీ మధ్య దూరం గుర్తింపే 'అందం'.
ఈ కవిత్వం పరిపక్వ మనస్థితిని తెలుపుతుంది.
జీవితం పట్ల ఆసక్తినీ, అనురక్తినీ కలిగిస్తుంది.
టాగూరు హృదయం గ్రహించిన కవయిత్రి మంచి సాధన చేసింది.
కవిత్వం హృద్యంగా, అనుభూతి రమ్యంగా ఉంది.

మంచి కవిత్వాన్ని ప్రోత్సహిస్తున్న శ్రీ యం.కె. సుగమ్‌బాబు గారిని అభినందిస్తున్నాను.

కవయిత్రికి శుభాకాంక్షలు.

నలుగురూ చదివితే, కవయిత్రి అనుభూతీ, ఆనందం పంచుకొంటారు.

ఆత్మీయంగా
మీ

(కొలకలూరి ఇనాక్)

డా॥ ఎమ్. శ్రీధర్
డా॥ అల్లాడి ఉమ
విశ్రాంత ఆచార్యులు,
యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్.

మా ముందు మాట

ఈ “వెన్నెల పక్షులు “. కేతవరపు రాజ్యశ్రీ గారిని మాకు పరిచయం చేసింది.

“మది దోచే వసంతకాలం
ఎక్కడెక్కడి నుంచో వలస వచ్చిన
రంగు రంగుల పక్షులు
కిటికీ మీద వాలి కూనిరాగాలతో మురిపించి
మైమరపించి
అంతలోనే ఎగిరిపోయాయి”

అంటూ మొదలుపెట్టి రవీంద్రనాథ్ టాగూర్ Stray Birdsకు ఆమె చేసిన 136 అనుసృజనలు చాలా హాయిగా మమ్మల్ని చదివించాయి. ఇవి టాగూర్ కవితలకు అనుకృతులని చెప్పకపోతే ఎవరూ తెలుసుకోలేనంత సాఫీగా సాగుతాయి.

తన రెండో, మూడో కవితలలో
“ప్రపంచం
విశాలంగా పరుచుకున్న
మేలి ముసుగును తొలగించి
అవ్యాజ ప్రేమతో
ప్రకృతిని ముద్దాడింది”

"గడగడ వణికించే శీతాకాలం
నిట్టూర్పులే పాటలుగా
ఆలపిస్తూ
పండుటాకులు
నేలరాలాయి"
అంటారామె.

తన అనువాదాల్ని అనువాదాలనిపించకుండా టాగూర్ తెలుగులో పలుకుతున్నట్లుగా చేయడం రాజ్యశ్రీ గారికి సాధ్యమైంది. అందుకే ఇవి నిజంగా అనువాదాలు కావు. అనునాదాలనవచ్చునేమో!

అందుకే ఈ తెలుగుసేతలు చేయడంలో ఆమె చాలా స్వాతంత్ర్యాన్ని తీసుకొని మరీ చేసినట్లనిపిస్తుంది.

మూలంలోని 326 కవితల్ని 136 కవితలుగా తెలుగులో తీసుకురావడంలో కూడా ఆమె తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. తన అనుకృతులను తనదైన రీతిలో అమర్చుకోవడాన్ని కూడా మనం గమనించవచ్చు. ఉదాహరణకు పై మూడు అనుకృతులకు టాగూర్ ఆంగ్ల మూలాల్ని చూడండి:

1

STRAY birds of summer come to my window to sing and fly away.

And yellow leaves of autumn, which have no songs, flutter and fall there with a sigh.

2

O TROUPE of little vagrants of the world, leave your footprints in my words.

3

THE world puts off its mask of vastness to its lover.
It becomes small as one song, as one kiss of the eternal.

టాగూర్ మొదటి కవితను తన సృజనలో రెండు కవితలుగా విడగొట్టి, ఆ రెండింటి మధ్యలో టాగూర్ మూలంలోని మూడో కవితను తన రెండో కవితగా చేసుకుంది.

తెలుగులో చదివేవారికి మాత్రం ఇవి అనువాదాలు అని ఎవరైనా చెప్తేనే తెలిసేంతగా తాను టాగూర్ కవితల్ని సొంతం చేసుకుంది.

టాగూర్ని తెలుగు వారికి అందించడానికి రాజ్యశ్రీగారు ఎన్నుకున్న పద్ధతి ఇది. అందుకే తాను జీర్ణించుకున్న విశ్వకవి "విచ్చలవిడి పక్షులకు" ఇవి రాజ్యశ్రీ గారి "వెన్నెల పక్షులు'.

ఈ అనుసృజనలకు వదలకుండా చదివించే గుణం మెండుగా ఉంది. మీరే చూద్దురుగానీ!

యం.కె. సుగమ్‌బాబు
రెక్కలు రూపశిల్పి

విశ్వకవి "స్ట్రేబర్డ్స్"
వెన్నెల పక్షులు

సంస్కృత సాహిత్యంలో గొప్ప ఊహాశాలి వాల్మీకి అంటారు. ఆంగ్ల సాహిత్యంలో షేక్స్పియర్ అంటారు. నేడు భారతీయ భాషల్లో, ముఖ్యంగా వంగ సాహిత్యంలో రవీంద్రనాథ్ టాగూర్ అంటాను.

"అమ్మ అందంలా
రాత్రి నిశ్శబ్దం
పసిపిల్లల అల్లరిలా
ప్రభాత సందడి"

– ప్రకృతికే ఓ వినూత్న శోభను కట్టబెట్టడం... పక్షుల శబ్దాలను పసిపిల్లల అల్లరిగా వ్యాఖ్యానించటం మహాకవికి మాత్రమే సాధ్యమైన ప్రజ్ఞ. అంత దూరం ఆయన ఎలా ప్రయాణం చేశాడు... ఊహే కావచ్చు. ఊతం ఎక్కడ? అదృశ్యంగా నడిచినట్టు లేదు?

డా॥ రాజ్యశ్రీ ఈ కావ్యాన్ని ఎంచుకోవడంలోనే ఆమె సత్తా తెలుస్తుంది. ఎవరు పట్టుకుంటారు ఇలాంటి దృశ్యాదృశ్యంగా సాక్షాత్కరించిన మహాకవిత్వాన్ని?

"తాను సృష్టించిన
ప్రతి ఉదయము
దేవుడికి
అద్భుతమే"

సృష్టికర్తకే అద్భుతం. అద్భుతాలు సృష్టించేవాడికే అద్భుదం. అంటే అద్భుతం అనే పదానికి మరో విధంగా విలువ కట్టలేకపోయాడు టాగోర్.

ఆపాదమస్తకం ఓ తాదాత్మ్యంలో మునిగిపోయాడు. తన అస్తిత్వాన్ని వదిలేశాడు.

"ఆమె

ఎదురు చూపులమోము

రాత్రి వర్షంలా

నా స్వప్నంలో

వెంటాడుతోంది"

వెంటాడ్డం అనేది ఎంత పొడవైన మాట! అందనంత పొడవైన ఆలోచన. ఆ మోమును మనం చూడలేదు. కానీ చూసినట్టు – అది రాత్రి వర్షాన్ని తలపిస్తూ. టాగోర్ అడుగులు ఎటుపడుతున్నాయి? సరాసరి మన గుండెల్లోకే కదా!

"దేవుడి

గొప్పదనం

సున్నితంగా వీచే

పిల్లగాలిలో ఉంది

తుపానులో కాదు" –

గొప్పదనం అంటే ఏమిటి? చాలామంది రాస్తుంటారు. నిర్వచించలేనిదనే అర్థంలో రాస్తున్నారా? ఇది భాష బలహీనతను తను చాటే పదమా? అవుననే అనుకోవాలి. సున్నితంగా వీచే పిల్లగాలిలో... తుఫానులో కాదు. ఎంపిక చేసుకున్న చక్కని పదాలు. పదాలు మహాకవులకు తప్ప లొంగుతాయా? టాగోర్ ఎంతటి అద్భుత భావుకుడో ఆ కవిత్వాన్ని వెన్నెల రేఖగా మనకు అనువదించిన డా॥ రాజ్యశ్రీ తన ప్రతిభను నిరూపించుకున్నారు.

చివరగా –

టాగూర్ విశ్వరూపాన్ని ప్రదర్శించిన ఈ కవితను చూడండి –

"కోత కోసిన

పంట పొలంలా

నా హృదయం

సంతృప్తిగా

ప్రశాంతంగా ఉంది" –

ఇది చాలా గొప్ప దృశ్యం. దీని ఘనత ప్రత్యక్షంగా చూసిన వారికే తెలుస్తుందనేది కూడా సత్యం. కోత కోసిన పొలం.. ప్రసవించిన స్త్రీతో సమానం. బిడ్డను చూసుకున్న తల్లి హృదయానికి, పంటను అర్పించిన పొలానికి తేడా లేదు. ఆ తల్లి ముఖమే అక్కడ నవ్వుతూ కనిపిస్తుంది. ఆ అలరింపే సంతృప్తిగాను ప్రశాంతంగాను తన హృదయాన్ని పరవశింపజేశాయి అంటున్నాడు టాగోర్ –

ఊహ సృజనకు ప్రాణం అనే మౌలికాంశం, టాగోర్ కవిత్వంలో అణువణువునా పరచుకొని ఉంది. మహాకవి ఆలోచన పూర్తిగా ఊహను ఆశ్రయించే ఉంది. విడగొట్టడం సాధ్యం కాదు. డా॥ రాజ్యశ్రీ అనువాదం కూడా ప్రాణంలో ప్రాణంగా కలిసిపోయి మహదానందకారకమైంది. –

ఇంతకు మునుపు డా॥ రాజ్యశ్రీ 'గీతా' శ్లోకాలను రెక్కలు మలచి ఉన్నారు. అది మరింత క్లిష్టమైన ప్రయత్నమైనా ఒక అద్భుత ప్రయోగంగా తెలుగు సాహిత్యంలో స్థానాన్ని పొందిన డా॥ రాజ్యశ్రీకి అభినందనలు.

నా మాట

'కవిత్వం ఓ తీరని దాహం'!

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ గారి కవితాసంకలనం "స్ట్రే బర్డ్స్" చదివినప్పుడు, ఇది అక్షర సత్యమనిపించింది. కవితల వెంట కళ్ళు పరుగులు తీస్తూ ఏకబిగిన చదివించిన పుస్తకం "స్ట్రే బర్డ్స్". టాగూర్ మొదట దీనిని బెంగాలీలో భాషలో రాసి, తరువాత ఇంగ్లీషులోకి అనువదించారు.

మనం రోజూ చూస్తున్న, అనుభవిస్తున్న విషయాలను (ప్రకృతి పరంగా, సామాజికపరంగా) చాలా అందంగా, కవితత్మాకంగా అలవోకగా రచించారు విశ్వకవి. ఒక సముద్రపు ఒడ్డునో, ఇంట్లో గది కిటికీ దగ్గర కూర్చున్నప్పుడు, మనసులో కలిగే భావాలను కాగితం మీద పెట్టారు.

మనం ఉదయం లేవగానే కిటికీ తెరచి బయటకు చూస్తే పక్షులు, పిచుకలు కిటికీ తలుపు మీద వాలి, వాటి భాషలో కాసేపు కిచకిచలాడి, వెంటనే అర్జెంట్ పని వున్నట్టు రివ్వున ఎగిరిపోతాయి. దారి వెంట నడుస్తున్న మనుషుల మాటలు, పిల్లల ఆటపాటల ఆలకిస్తాము. దీనినే టాగూర్ ఇంగ్లీషులో రాసినది చదువుతుంటే, నా మనసు దానిని తెలుగులోకి ఇలా తర్జుమా చేసింది.

"ఉదయం నా గది కిటికీ తెరిచాను
ప్రపంచం ఒక్క క్షణం నన్ను పలకరించి
వడివడిగా వెళ్ళిపోయింది"

ఏమీ కష్టపడకుండా, యతిప్రాసలు అవసరం లేకుండా, స్వేచ్ఛగా టాగూర్ కవితలు మంచినీళ్లు తాగినంత సులువుగా, చదువుతుంటే మనసు దానంతటి అదే మాతృభాషలోకి అనువాదం చేస్తూ, ఆహ్లాదపరిచింది. ఇదే విషయాన్ని ప్రముఖ కవి, రెక్కల ప్రక్రియ రూపశిల్పి, నాకు ఆత్మీయులు

అయిన సుగమ్‌బాబుగారితో పంచుకున్నాను.

మీరు దీనిని తెలుగులోకి ఎందుకు అనువాదం చేయకూడదు? దీనిలోని కవిత్వం మీలో కల్గించిన స్పందన, పాతబడిపోకుండా, వెంటనే అనువాదం మొదలుపెట్టండి అన్నారు.

"నేను ప్రస్తుతం మా అమ్మాయి డెలివరీ కోసం అమెరికా వెళ్తున్నాను. వచ్చిన తరువాత చూస్తాను" అన్నాను.

"అమెరికా వెళ్తే మాత్రం రాయకూడదా! అక్కడ 24 గంటలూ పని వుండదు కదా! తీరిక సమయాల్లో రాయండి. అక్కడికెళ్లాక కవిత్వాన్ని నిర్లక్ష్యం చేయకండి అంటూ చిన్నగా మందలిస్తూ ప్రోత్సహించారు.

ఆ ప్రోత్సాహంతోనే అనువాదం మొదలుపెట్టాను.

టాగూర్ ఇందులో ఒక లైను, రెండు లైన్లు, 4, 5, 6 లైన్లలో తన భావాన్ని కవితాత్మకంగా మొత్తంగా 320 కవితలు ఇందులో పొందుపరిచారు.

నేను అనువాదం చేసుకుంటూ వెళ్తుంటే కొన్ని కవితల్లో భావం ఒకటేగా అనిపించింది. చాలా మటుకు విశ్వకవి, సముద్రపు ఒడ్డున కూర్చుని తన మనసులో కలిగే భావాలను, హృదయపు అలజడులను, తుఫానుతో, కడలి అలలతో, పొగమంచుతో పోల్చుకుంటూ వేదన, నిట్టూర్పులతో రాసినవి వున్నాయి.

వాటిని నేను అనువాదం చేస్తున్నప్పుడు కొన్ని రిపీట్ అయినవి వదిలేసి 136 కవితలు స్వేచ్ఛానువాదం చేశాను. అన్నీ కూడా ఆయన రాసిన వరుస క్రమంలో కాకుండా, అక్కడక్కడా మార్పులు చేశాను. అందుకే ఇవి అనువాదం కాకుండా అనుసృజన చేశానని డా॥ శ్రీధర్, డా॥ అల్లాడి ఉమ అభిప్రాయపడ్డారు.

దాదాపుగా ఈ కవితలను 15 రోజుల్లో పూర్తి చేసి, వాట్సాప్‌లో

సుగమ్‌బాబుగారికి పంపించాను. వారు మీ అనుసృజన అద్భుతంగా వుంది, వెంటనే పుస్తకం వేద్దాం. అమెరికాలోనే ఆవిష్కరణ చేయండి అంటూ నాకంటే ఎక్కువగా ఆనందపడ్డారు.

ఏప్రిల్ 21 తేదీన డల్లాస్ (యు.ఎస్.ఏ.) నగరంలోని, ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం వారు ఉగాది ఉత్సవాల సందర్భంగా నన్ను ముఖ్య అతిధిగా ఆహ్వానించారు. ఒక గంట సేపు సాహితీ ప్రసంగం చేయమని అడిగారు.

“షడ్రుచుల సమ్మేళనం – కవిత్వం” అనే అంశం మీద ప్రసంగించి సాహితీవేత్తల మెప్పు పొందడం జరిగింది. ఇదే సభలో నా అనువాద కవితా సంకలనం “వెన్నెల పక్షులు” ఆవిష్కరణ చేద్దామనుకున్నా. కానీ పుస్తకం డి.టి.పి. అయినా, టైటిల్ పేజీ ఇతర పనులు కాకపోవడం, హైదరాబాదు నుంచి కొరియర్‌లో పుస్తకాలు రావడం, సమయం పడుతుంది కాబట్టి, ఆవిష్కరణ వీలు పడలేదు. దాని బదులు నా కవిత్వ విశ్లేషణ, వంద ప్రశ్నలకు నేను రాసిన జవాబుల వినూత్న సాహితీ ప్రక్రియ “వంద ప్రశ్నలు వేల భావాలు” పుస్తకాన్ని ఆ సభలో ఆవిష్కరించాను.

ఈ అనువాద గ్రంధానికి “వెన్నెల పక్షులు” అని నామకరణం చేశాను. ఎందుకంటే వెన్నెల రాత్రి పక్షుల కువకువలు, ఆహ్లాదకరమైన ప్రకృతి ఎంత హాయిగా వుంటుందో, ఈ కవిత్వం కూడా చాలా హాయిగా, మనోల్లాసం కలిగించే విధంగా వుంటుంది.

“పొగడ్త నన్ను సిగ్గుపడేలా
చేస్తుంది
కానీ నా మనసులో
దాని కోసం ఆరాటం”

అని ఒక చోట విశ్వకవి రాసిన కవిత ఎంత అక్షర సత్యమో కదా!

అలాగే ఇంకో కవిత –

"దేవుడు లేకపోతే
ప్రపంచమంతా ఒకే మతం"

ఇలా అనువాదంలో ఎక్కడా మూలం చెడిపోకుండా టాగూర్ స్థాయికి తగినట్టు రాయడానికి ప్రయత్నం చేశాను.

నా ఈ ప్రయత్నం సఫలీకృతం అయిందో లేదో "వెన్నెల పక్షులు" చదివి సహృదయులు తెలపాలి.

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

కృతజ్ఞతలు

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ "స్ట్రే బర్డ్స్" కవితలను తెలుగులోకి అనువాదం చేయమని నన్ను ప్రోత్సహించిన వారు సుగమ్‌బాబుగారు. "టాగూర్ ఎంతటి అద్భుత భావకుడో, ఆ కవిత్వాన్ని వెన్నెల రేఖగా మనకు అనువదించి డా॥ రాజ్యశ్రీ తన ప్రతిభను నిరూపించుకున్నారు. వెన్నెల పక్షులు అనుసృజన మహదానందకారమైంది" అంటూ తన ముందు మాటలో రాసి పుస్తకావిర్భావానికి పరోక్షకారకులైన సుగమ్‌బాబుగారికి కృతజ్ఞతాభివందనాలు.

"చాలా కాలానికి మళ్లీ విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ కవిత్వం చదివే అదృష్టం కలిగించిన డా॥ రాజ్యశ్రీకి అభినందనలు. వీరి కవిత్వం, పరిపక్వ మనస్థితినీ, జీవితం పట్ల ఆసక్తినీ, అనురక్తినీ కల్గిస్తుంది. కవిత్వం హృద్యంగా, అనుభూతిరమ్యంగా ఉంది" అంటూ తన శుభాకాంక్షలు అందజేసిన పద్మశ్రీ, జ్ఞానపీఠ్–మూర్తిదేవి పురస్కార గ్రహీత డా॥ కొలకలూరి ఇనాక్‌గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

"ఈ "వెన్నెల పక్షులు" కేతవరపు రాజ్యశ్రీ గారిని మాకు పరిచయం చేశాయి. రవీంద్రనాథ్ టాగూర్ "స్ట్రే బర్డ్స్"కు ఆమె చేసిన 136 అనుసృజనలు చాలా హాయిగా మమ్మల్ని చదివించాయి. తన అనువాదాన్ని అనువాదాలనిపించకుండా టాగూర్ తెలుగులో పలుకుతున్నట్లుగా చేయడం డా॥ రాజ్యశ్రీగారికి సాధ్యమయింది. అందుకే ఇవి నిజంగా అనువాదాలు కావు. అనునాదాలు అనవచ్చునేమో! ఈ అనుసృజనలకు వదలకుండా చదివించే గుణం మెండుగా వుంది" అంటూ నా అనుసృజనకు అందంగా రెక్కలు తొడిగిన డా॥ ఎమ్. శ్రీధర్, డా॥ అల్లాడి ఉమగార్లకు ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ పుస్తకం రాయడానికి అమెరికాలో వారి ఇంట్లో సదుపాయాలు, సాంకేతిక సహకారం అందించిన కూతురు ప్రియాంక, అల్లుడు శ్రీకాంత్ మరియు కొడుకు ఫణీంద్ర, కోడలు వత్సలకి నా ఆశీస్సులు.

ఇంటికి వచ్చిన సాహితీ మిత్రులను చిరువ్వుతో పలకరిస్తూ నా రచనా వ్యాసంగం కొనసాగడానికి సుహృద్భావ వాతావరణం కల్పించిన మా శ్రీవారు మాధవరావుగారికి కృతజ్ఞతలు.

తమ ముద్దుమురిపాలతో, ఆటపాటలతో నా మనసును ఆహ్లాదపరచి చక్కని కవిత్వం సృజించడానికి స్ఫూర్తిగా నిలిచిన నా మనుమడు చి॥ అక్షర్, మనుమరాలు చి॥ ఆకాంక్షలకు నా ఆశీస్సులు.

అలగే ఈ పుస్తకాన్ని డి.టి.పి. చేసి అందంగా ముద్రించిన “అక్షయ గ్రాఫిక్స్” అధినేత టి. రాజేంద్రప్రసాద్ గారికి ధన్యవాదాలు.

డా॥ కేతవరపు రాజ్యశ్రీ

"వెన్నెల పక్షులు"

మది దోచే వసంతకాలం
ఎక్కడెక్కడి నుంచో వలస వచ్చిన
రంగు రంగుల పక్షులు
కిటికీ మీద వాలి
కూనిరాగాలతో
మురిపించి, మైమరపించి
అంతలోనే ఎగిరిపోయాయి

ప్రపంచం
విశాలంగా పరుచుకున్న
మేలి ముసుగును తొలగించి
అవ్యాజ ప్రేమతో
ప్రకృతిని ముద్దాడింది

గడగడ వణికించే శీతాకాలం
నిట్టూర్పులే పాటలుగా
ఆలపిస్తూ
పండుటాకులు
నేలరాలాయి

ఎడారి
తహతహలాడుతోంది
చిన్న గడ్డి మొలక
పలకరింపు కోసం
దానిమీద నుంచి ఎగిరే
పక్షుల కిల కిల రావాల కోసం

సూర్యకాంతిని చూడలేక
కళ్లల్లో నీరు నిండితే
రాత్రిపూట
చుక్కలను కూడా చూడలేవు

ఆమె
ఎదురు చూపుల మోము
రాత్రి వర్షంలా
నా స్వప్నంలో
వెంటాడుతోంది

కలలో మేము
అపరిచితులుగా అనిపిస్తాం
మెలకువ రాగానే
ఎంతో ఆత్మీయులం

చీకటి పడగానే
మౌనం వహించిన వృక్షల్లా
నా హృదయంలోని దుఃఖాన్ని
నిశ్శబ్దంగా అణిచి వేశాను

దిశా నిర్దేశం లేని
చలి గాలిలా
ఏదో అదృశ్య హస్తం
నా హృదయతంత్రులని
మీటుతోంది

ఓ సాగరమా! నీ భాష ఏమిటి?
నీ భాష అంతులేని ఓ ప్రస్నా?
ఓ గగనమా! నీ జవాబుకి భాష ఏమిటి?
అంతులేని మౌనమేనా?

హృదయమా! ఆలకించు
ప్రకృతిలోని అణువణువు
తన ప్రేమను
తెలియజేస్తోంది

రాత్రి "చీకటి"
సృష్టిలోని మాయలా
అంతు చిక్కడం లేదు
వుషోదయపు
మంచు పొరలా
జ్ఞానమనే భ్రాంతి

ప్రేమకు
చిన్న పీట వేయకు
అది భాషకందని
ఓ మధుర భావన

ఉదయం
నా గది కిటికీ తెరిచాను
ప్రపంచం
ఒక్క క్షణం ఆగి
నన్ను పలకరించి
వెళ్లిపోయింది

ఈ చిన్ని చిన్ని తలపులు
ఆకుల గలగలల్లా
నా మదిలో
సంతోషపు సవ్వడులు

నువ్వేమిటో
నువ్వు చూడలేవు
నువ్వు చూడగలిగేది
నీ నీడని మాత్రమే

నా కోరికలు
గుర్రాలు
నా మనసు మీద
స్వారీ చేస్తున్నాయి
వాటి మాట కూడా
వినాలి కదా!

మంచి చేయడమే తెలుసు
అందుకేనేమో
అది నన్ను వెతుక్కుంటూ
వస్తుంది

లాంతరు వెనకాల మోసుకొచ్చి
తమ నీడను
తామే
ముందుకు తీసుకెళ్తున్నారు

నా అస్తిత్వం
పరమాశ్చర్యం
అదే!
జీవితం

తుఫాను సవ్వడికి
ఆకుల గలగలలు
సమాధానమిస్తున్నాయి
మరి నువ్వెందుకు మౌనంగా ఉన్నావు?
నేను ఒక గడ్డిపోచను మాత్రమే!

విశ్రాంతి
పనికి వర్తిస్తుంది
కళ్లకి
కనురెప్పల మాదిరిగా

ప్రతి మనిషి
శిశువుగానే జన్మిస్తాడు
అతని శక్తి
అతని ఎదుగుదల

దేవుడు
తాను పంపిన
పుష్పాల కోసం
సమాధానం ఆశిస్తాడు
భూమి గురించి
సూర్యుడి గురించి కాదు

పచ్చని ఆకుల మధ్య నుంచి
అచ్చాదన లేని శిశువులా
ఆడుకునే వెలుగు రేఖకు
తెలియదు
మనిషి
అబద్ధమాడగలడని!

అందమా!
ప్రేమించడంలో
నీ అస్తిత్వాన్ని వెతుక్కో
అద్దంలో కనిపించే
అందాలలో కాదు

విశ్వ తీరంలో
నా హృదయ కెరటాలు
కన్నీళ్లతో సంతకం చేస్తున్నాయి
"నేను నిన్ను ప్రేమిస్తున్నానని"

చంద్రమా!
ఎవరికోసం ఎదురు చూస్తున్నావు?
సెలవు చీటీ
సూర్యుడికి అందచేయడానికా?

తాను సృష్టించిన
ప్రతి ఉదయమూ
దేవుడికి
అద్భుతమే!

జీవితం తన విలువను
గడచిన
క్షణం నుంచి
తెలుసుకుంటుంది
తన అస్తిత్వాన్ని
ప్రేమ ద్వారా

మేటవేసిన నది ఒడ్డు
తన గతానికి
కృతజ్ఞతలు
చెప్పదు

పక్షి తాను
మేఘంలా
ఉండాలనుకుంటుంది
మబ్బు తాను
పక్షిలా
ఎగరాలనుకుంటుంది

జలపాతం
పాడుకుంటోంది
అఘాతంలో పడుతున్నానని కాదు
స్వేచ్ఛగా పారుతున్నాని
కిందకు జారుతున్నానని

నేను చెప్పలేను
ఎందుకీ హృదయం
ఏదో లోపం వెతుక్కుని
మౌనంగా తనలో తనే
కృశిస్తుందని

ఓ ఇంతీ!
నువ్వు ఇంటిపనులలో
తలమునకలుగా
అష్టావధానం చేస్తుంటే
నీ చేతులు
పెద్ద కొండ వాగులో
గులకరాళ్లలా
పాట పాడుతున్నాయి

సూర్యుడు
తూరుపు దిక్కుకి
ఆఖరి వందనం చేసి
పడమరకి
పయనమయ్యాడు

రుచిగా లేదని
భోజనానికి వంక పెట్టకు
ఎందుకంటే
నీకు ఆకలిగా లేదు

నేలతల్లి
తీరని కోరిక లాగే,
చెట్లు కూడా
ఆశగా, ఆతృతగా
ఆకసం వైపు
చూస్తున్నాయి

నువ్వు నన్ను
చూసి మౌనంగా
చిరునవ్వు నవ్వావు
దీని కోసమే
ఎన్నాళ్లుగాను
ఎదురు చూస్తున్నాను

నీటిలోని చేప మౌనంగా వుంటుంది
నేల మీది జంతువు శబ్ధం చేస్తుంది
గాలిలోని పక్షి పాట పాడుతుంది
కానీ
మనిషిలో సహజంగానే
నీటిలోని నిశ్శబ్దం
నేల మీది సందడి
గాలిలోని సంగీతం
నిక్షిప్తమై వున్నాయి

ఈ ప్రపంచం
నా హృదయ తంత్రుల మీద
పరుగులు పెడుతోంది
విషాద గీతం ఆలపిస్తూ

దేవుడిని
తన ఆయుధంగా
మలచుకున్నాడు
అతని ఆయుధం
గెలిస్తే
అతడు ఓడినట్టే!

దేవుడు
తనని తాను
తెలుసుకున్నాడు
తన అద్భుతమైన
సృష్టి ద్వారా

నక్షత్రాలు
సిగ్గు పడవు
మిణుగురు పురుగుల్లా
కనపడటానికి

నేను కృజ్ఞతలు చెబుతాను
ఎందుకంటే
నేను అధికార చక్రంలా కాకుండా
దానికింద పడి నలిగే
ప్రాణిని

మనసు చాలా వేగం
కానీ విశాలమైనది కాదు
కట్టెలు అన్ని చోట్లా వుంటాయి
కానీ
చలనం లేనివి

నీడ
తన ముసుగు తొలగించి
వెలుగుని
అనుసరిస్తుంది
నిశ్శబ్దంగా
దానిని ప్రేమిస్తూ

దేవుడి విగ్రహం
మట్టిలో కలిసిపోయిందా?
దేవుడి కంటే
విగ్రహం గొప్పది కాదని
నిరూపించడానికే!

మనిషి తన గురించి
చరిత్రలో చెప్పకోడు
చరిత్ర సృష్టించడానికి
కష్టపడతాడు

సముద్రపు కాకులు – కెరటాలు
కలుసుకున్నట్టు
మనం కలుసుకుని దగ్గరవుతాం
కాకులు ఎగిరిపోతాయి
కెరటాలు వెనక్కి వెళ్లిపోతాయి
మనం విడిపోతాం

నా రోజు సమాప్తమయింది
ఒడ్డుకు చేరిన
నావలాగా ఉన్నాను
అలల సంగీతం
వింటూ

జీవితం
ఎవరో మనకి ఇచ్చారా?
కొంత కోల్పోయి
సంపాదించుకున్నాము

ఎప్పుడూ భయపడకు
ఆ క్షణం గురించి
అది
అమరత్వం

దారి మూసుకుపోయిన చోట
"తుఫాను"
దగ్గరి దారి వెతుక్కుంటుంది
ఎక్కడా దారిలేని చోట
వెతకటం ఆపి
అకస్మాత్తుగా ఆగిపోతుంది

చక్కదనం
అలంకరించుకుంటుంది
కొదవగాని
ప్రేమకోసం

దేవుడు మనిషితో అంటున్నాడు
నిన్ను గాయపరిచాను కాబట్టి
నయం చేస్తున్నాను
నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టి
దండిస్తున్నాను

దీపం ఇచ్చే వెలుగుకి
కృతజ్ఞతలు చెప్పు
కానీ
చాలా సేపటి నుంచి
దాని నీడలో ఓపికగా
దీపం పట్టుకుని నిలుచున్న వాడి విషయం
మర్చిపోకు

ఓ చిరు గడ్డీ!
నీ పాదాలు చాలా చిన్నవి
కానీ
ఈ భూమిని నీ కాళ్ల కింద
తొక్కి పెట్టావు

మొగ్గ నుండి విడివడి
అప్పుడే వికసించిన
చిన్ని పువ్వు
ఏడుస్తోంది
"ఓ ప్రపంచమా!
దయచేసి వాడిపోకు"

"తప్పు"
ఓటమిని ఒప్పుకోలేదు
కానీ
"మంచి" ఒప్పుకుంటుంది

జలపాతం
తన నీటిని
మొత్తం
సమర్పిస్తానంటుంది
దాహం తీరడానికి
కొంచెం నీళ్లు
సరిపోయినా!

చెట్లు కొట్టే గొడ్డలి
చేతి“పిడి” కోసం
కట్టెనిమ్మని
చెట్టుని అర్థించింది
చెట్టు
ఇచ్చింది

నా హృదయపు
ఒంటరితనంలో
పొగమంచు, వర్షంతో కూడిన
సాయంత్రపు నిస్పృహ
అనుభవించాను

"పవిత్రత" అనే సంపద
అవధులు లేని
అభిమానం నుండి
జనిస్తుంది

మనం
ప్రపంచాన్ని
తప్పుగా అర్థం చేసుకుని
అది మనల్ని
మోసం చేసిందని
భావిస్తాం

"పొగమంచు"
ప్రేమ లాగే
హృదయ కవాటాల మీద
ఆడుకుని
అద్భుతమైన ఆనందాలను
అందిస్తుంది

చిలుక
నెమలి మీద
జాలిపడింది
దాని తోక
బరువును చూసి

ప్రతి శిశువు
ఒక సందేశం తీసుకువస్తుంది
దేవుడికి
మనిషి మీద
ఇంకా
నమ్మకం పోలేదని

“గడ్డి”
భూమి మీద సమూహంగా
వుండడానికి ప్రయత్నిస్తుంది
“చెట్టు”
“నింగి” లా
ఏకాంతం కోసం
వెతుకుతుంది

మనిషి
తనకి తాను
అడ్డుగోడలు
నిర్మించుకుంటాడు

చీకటిలో
కనపడని ఆ వెలుగేమిటి?
ఎవరి వెలుగులు
ఈ నక్షత్రాలు?

వసంతంలో విరిసే
కుసుమంలా
జీవితం
చాలా అందమైనది
హేమంత ఋతువులో
రాలిన ఎండుటాకులా
మరణం!

ఎవరైతే స్వచ్ఛమైన
మనస్సుతో
ఆత్మీయంగా
తలుపులు తడతారో
వారికి గుండె లోగిళ్లు
తెరుచుకుంటాయి

సమూహం నుంచి
ఒంటరిని చేస్తుంది
“మరణం”
“ఒంటరి”
సమూహంగా అవుతాడు
జీవన యానంలో

దేవుడు
లేకపోతే
ప్రపంచమంతా
ఒకే “మతం”

చిత్రకారుడు
ప్రకృతి ప్రేమికుడు
అందుకే
అతడు ఆమెకు
దాసుడు,
యజమాని కూడా

పువ్వు అడిగింది
నువ్వు నా నుంచి ఎంత దూరం?
నేను నీ హృదయంలోనే వున్నాను
చెప్పింది “పండు”

నా ఎదురు చూపులు
చీకటిలో వున్నానని
భావించేవారికోసం
వెలుగులో
కనపడని వారికోసం
కాదు

పచ్చదనం సాయంతో
భూమి
అందరికీ
ఆతిధ్యమిస్తోంది

హిమబిందువు
సరస్సుతో అంది
నువ్వు
తామరాకు కింద ఉండే
పెద్ద మంచు బిందువు
నేను దాని పైన మెరిసే
చిన్ని బిందువును

తాను ఎదురు చూసిన
సూర్యుడినే
కప్పేస్తుంది
పొగమంచు

మబ్బు తునక
ఆకాశంలో ఒక మూల
వినయంగా నుంచుంది
వుషోదయం
దాన్ని
కిరిటంతో అందంగా
అలంకరించింది

మట్టి
అవమానింపబడుతుంది
అయినా
తిరిగి పూవులను
అందిస్తుంది

పువ్వులను
కోయడానికి తిరగకు
నువ్వు నడిచి వెళ్తుంటే
దారి పొడవునా
కనువిందు చేస్తాయి.

వూరూ పేరూ లేని
రోజుల్ని తలుచుకుంటే
చెట్టు చుట్టూ కంచె లాగా
నా హృదయాన్ని
కలచివేస్తుంది

చెట్టు వేళ్లు
భూమి కింది "కొమ్మలు"
కొమ్మలు
గాలిలోని "వ్రేళ్లు"

నిశ్చలంగా వుండు
హృదయమా!
ఈ మహా వృక్షాలు
ప్రార్థన చేస్తున్నాయి

ప్రతి ధ్వని
తన పుట్టుకకు
అవమానపడుతూ
తానే ధ్వనికి మూలమని
నిరూపించాలనుకుంటుంది

దేవుడు
సిగ్గుపడ్డాడు
సంపన్నుడు
తన భోగభాగ్యాల గురించి
గొప్పలు చెపుతుంటే!

మనిషి
రణగొణ ధ్వనుల మధ్య వుంటూ
తన ఏకాంతాన్ని
తానే కోల్పోతున్నాడు

సూర్యుడు
నిరాడంబరంగా
వెలుతురనే వస్త్రాన్ని
ధరించాడు
మేఘాలు అందంగా
ఆడంబరంగా
అలంకరించుకున్నాయి

పిల్లలు కేరింతలు కొడుతూ
నక్షత్రాలను
పట్టుకునేందుకు
చేతులు పైకెత్తినట్టుగా
వున్నాయి
"కొండలు"

రోడ్డు
ఎంత మంది జనాలున్నా
ప్రేమ కోసం తపిస్తూ
ఒంటరిగా!

తేనెటీగలు
పూలలోని మకరందాన్ని గ్రోలి
వెళ్లేటప్పుడు
తమ ఝుంకారంతో
పూలకి కృతజ్ఞతలు చెబుతాయి
రంగు రంగుల సీతాకోక చిలుక
మిడిసిపాటుతో
పువ్వులు తనకి
ధన్యవాదాలు
చెబుతాయనుకుంటుంది

తప్పుకి
తలుపులు మూసేస్తే
నిజం
దానంతట అదే
బైటికి వస్తుంది

చేప మీద చాలా
దయ చూపించాననుకుంటుంది
పక్షి
దానికి గాలిలోకి ఎగిరే అవకాశం
ఇచ్చాననుకుని

దేవుడి
గొప్పతనం
సున్నితంగా వీచే
పిల్లగాలిలో వుంది
తుఫానులో కాదు

నేను అటు నుంచి ఇటు
ఇటు నుంచి అటూ
ప్రయాణిస్తూ అలిసిపోతాను
కానీ
ఓ రహదారీ!
నీకు నమస్కరిస్తున్నాను
నేను వెళ్లాలని కోరుకునే
ప్రతి చోటుకీ
దోవ చూపిస్తున్నావు

నాలోని శూన్యతకి
సిగ్గుపడుతున్నానంది
“మాట”
నిన్ను చూసిన తరవాత
తెలిసింది
నేనెంత అభాగ్యురాలినో
అంది “తెలివి”

వర్షాన్ని చూసి
గాలి అటూ ఇటూ
వేగంగా కదులుతోంది
నేను మాత్రం
వూగుతున్న చెట్ల కొమ్మలనీ
అందమైన ప్రకృతినీ
ఆశ్వాదిస్తున్నాను

భూమి కింద వున్న
చెట్టు వేళ్లు
కృతజ్ఞతలు ఆశించవు
కొమ్మలను
ఫలవంతం
చేసినందుకు

సుత్తి దెబ్బలు కావు
జలపాతాల సరాగాలే
గులక రాళ్లను
నున్నగా చేస్తాయి

"రాత్రి"
నిశ్శబ్దంగా
పువ్వులను వికసింపచేసి
"పగటికి" కృతజ్ఞతలు
చెప్పిస్తుంది

పూరేకులను
తుంపేస్తే
పూల అందాలను
ఆస్వాదించలేవు

అస్తమించే "సూర్యుడు" అడిగాడు
ఎవరైనా నా విధులు
నిర్వహిస్తారా?
నాకు చేతనైనంత చేస్తానంది
"మట్టి దీపం"

పండు
మనిషికి ఆకలి తీర్చి
సేవ చేస్తుంది
పువ్వు
మంచి సువాసనతో
సేవ చేస్తుంది
కానీ
ఎంతో మందికి నీడ నిచ్చే
ఆకుల్లాగా
నేను ఉండాలనుకుంటాను

నిరంతరం
ఇతరులకి సాయం చేయడంలో
నిమగ్నమయ్యేవాడికి
తన బాగు గురించి
పట్టించుకునే
సమయం ఉండదు

నక్షత్రాలను కోల్పోయిన
ఉదయపు ఆకాశంతో
పూలు మొర పెట్టుకున్నాయి
సూర్యోదయం కాగానే
తమ మీది మంచు బిందువులు
మాయమయ్యాయని

పాత్రలోని నీళ్లు
స్వచ్ఛంగా వుంటాయి
సముద్రంలో నీళ్లు
నల్లగా వుంటాయి
చిరు వాస్తవం చెప్పే మాటలు
స్వచ్ఛంగా వుంటాయి
యదార్థం మౌనంగా వుంటుంది

"సూర్యరశ్మి"
చిరునవ్వుతో
నన్ను పలకరించింది
అతని విచార సోదరి
"వర్షం"
నా మనసుతో
మాట్లాడింది

దేవుడు
మనిషి వెలిగించే
దీపాన్ని ప్రేమిస్తాడు
తాను సృష్టించిన
నక్షత్రాల కన్నా

"పొగడ్త"
నన్ను సిగ్గు పడేలా చేస్తుంది
కానీ నా మనసులో
దాని కోసం
ఆరాట పడతాను

గెలుపు
ఒంటరిగా రాదు
చాలా మందిని
తోడుగా తెస్తుంది

మంచు తుంపరలకి
ఇంద్రధనుస్సులోని రంగులను
తొడుగుతాయి
మన కోరికలు

మేఘాలు
నా జీవితంలోకి
వచ్చిపోతుంటాయి
వర్షాన్నీ, తుఫాన్నీ
తీసుకురావడానికి కాదు
నా సూర్యాస్తమయ
జీవితానికి రంగులద్దడానికి

"విచార భావాలు"
అడుగుతాయి
మా పేర్లు
ఏమిటని

భూమి
తన ప్రేమను నిరాకరించిందని
బాధతో చేసే
ఆక్రందనలా ఉంది
"తుఫాను"

ప్రేమ
విఫలం అయినప్పుడు
జీవితం
విలువలేనిదిగా అనిపిస్తుంది

కత్తి
తనను పట్టుకున్న
చేతిని కూడా
గాయపరుస్తుంది

ముళ్లని
చూడగలిగిన వాడే
పువ్వులను
ప్రేమించగలడు

చంద్రుడు
తన వెలుగుని
ఆకాశమంతా
ప్రసరిస్తాడు
నల్లని మచ్చలను
తనలోనే దాచుకుంటాడు

పిరికి ఆలోచనలు
నా దరికి రాలేవు
నేను
ఒక కవిని

వాన చినుకు
మల్లె పూవును అడిగింది
నన్ను నీ హృదయంలో
శాశ్వతంగా భద్రపరుచుకొమ్మని
మల్లె నిట్టూరుస్తూ
హా! "హతవిధీ! అంటూ
నేల రాలింది

పడవ హొయలు పోతూ
గాలితో, నీటితో
సయ్యాట లాడుతోంది
ఓ హృదయమా!
ప్రపంచపు ఆటుపోట్లలో
నీ ఆనందాన్ని వెతుక్కో

"కళ్లు"
వాటికి అయాచితంగా లభించిన
దృష్టి గురించి కాకుండా
కళ్లజోడు ఖరీదుని చూసి
గర్వపడుతున్నాయి

ఓ ధరిత్రీ
నీ తీరానికి
ఒక అపరిచితుడిలా వచ్చాను
నీ ఇంట్లో ఒక అతిథిలా ఉన్నాను
తలుపు తెరుచుకుని స్నేహితుడిలా
బయటకు వెళ్తున్నాను.

ఓ విశ్వమా!
ఒక్క మాట నా కోసం దాచి ఉంచు
నేను చనిపోయే ముందు
"నిన్ను ప్రేమించానని"

మనం
ఈ ప్రపంచాన్ని
ప్రేమించినప్పుడే
మనం జీవించినట్టు!

తెల్లవారుజామున
కలత నిద్రలో లేచిన శిశువు
తల్లిని చూసి
చిరునవ్వు నవ్వి
మళ్లీ నిద్రలోకి జారినట్టు
జీవితమా!
నిన్ను నేను చూస్తున్నాను

రాత్రిని వణికించిన
భయంకర తుఫాను
గొప్ప ప్రశాంతతను
ఉదయానికి
బహుమతిగా ఇచ్చింది

అమ్మ అందంలా
రాత్రి నిశ్శబ్దం
పసిపిల్లల అల్లరిలా
ప్రభాత సందడి

చిరునవ్వు నవ్వినప్పుడు
మనిషిని
ప్రేమించింది
నవ్వినప్పుడు భయపడింది
లోకం!

ప్రపంచమా!
నన్ను నిజాయితీగా
బ్రతకనియ్యి
అప్పుడు నా చావు కూడా
నిజాయితీగా ఉంటుంది

కోత కోసిన
పంట పొలంలా
నా హృదయం
సంతృప్తిగా
ప్రశాంతంగా ఉంది

ఎక్కవలసిన మెట్లన్నీ ఎక్కి
శిఖరాన్ని చేరుకున్నాను
పేరు ప్రతిష్టలలో
తృప్తి దొరకలేదు
ఏదో తెలియని వెలితి
దేవుడా!
చీకటి పడే లోపు
నన్ను ప్రశాంతమైన
జ్ఞానజ్యోతి వైపు
నడిపించు

దేవుడా!
ఇది నా జీవిత చరమాంకపు
మాట
"నేను నీ ప్రేమను
నమ్ముతున్నాను"

తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా జూన్ 3వ తేదీన “చేతన సచివాలయ సారస్వత వేదిక” సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు సంగీత నాటక అకాడమీ చైర్మన్ శ్రీ బి. శివకుమార్ గారిచే సత్కారం. సభలో ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్ గారు, చేతన అధ్యక్షురాలు మరియు ప్రభుత్వ అదనపు కార్యదర్శి శ్రీమతి జి. కృష్ణవేణి, ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర అతిథులుగా పాల్గొన్నారు.

తెలంగాణ “రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి” వారు నిర్వహించిన “వాయు కాలుష్య నివారణ” సదస్సులో ప్రసంగం. EPTRI పర్యావరణ శాస్త్రవేత్త ఎన్. రవీందర్, ప్రభుత్వ అదనపు కార్యదర్శి జి. కృష్ణవేణి, EPTRI ఫ్యాకల్టీ, భవాని గార్లచే సత్కారం

సింగపూర్ యాత్రలో వివిధ దేశాల మహిళలతో రచయిత్రి

రచయిత్రి పరిచయం

డా॥ కేతవరపు రాజ్యశ్రీ, ఎం.కామ్.

వృత్తి : ప్రభుత్వ ఉపకార్యదర్శి (పూర్వ)

ప్రవృత్తి : రచనా వ్యాసంగం, సామాజిక సేవ.

వివిధ ఆధునిక ప్రక్రియలతో ముద్రిత రచనలు - 20

సామాజిక రచనలు : 1. ఊహల వసంతం, 2. తృప్తీ నీవెక్కడ, 3. ఆ రసాన్ని మింగాలని - వచన కవిత్వం సామాజిక స్పృహ, 4. చిరుసవ్వడులు, 5. గుండె చప్పుళ్ళు - నానీల ప్రక్రియతో సామాజిక కోసం, 6. వెన్నెల మెట్లు - రెక్కల ప్రక్రియ సామాజిక దృక్కోణం, 7. బొమ్మా బొరుసు - వ్యంజకాలు, 8. అక్షర కేతనం - ముక్తికాలు - అక్షరం అనే పదం ఈ ముక్తకం, 9. సిసింద్రీలు - మినీ కవిత్వం - సామాజిక స్పృహ, 10. వంద ప్రశ్నలు - వేల భావాలు - సాహితీ విశ్లేషణ

ఆధ్యాత్మిక రచనలు : 1. నీలోకి నువ్వు - ఆధ్యాత్మిక వ్యాసాలు, 2. ఆధ్యాత్మికత వృద్ధులకేనా - ఆధ్యాత్మిక వ్యాసాలు, 3. రెక్కలో గీతామృతం - భగవద్గీత సారం రెక్కల ప్రక్రియలో

విదేశీ యాత్రా విశేషాల గ్రంథాలు : 1. నా లండన్ యాత్ర, 2. సింగపూర్, మలేషియా మరియు శ్రీలంక యాత్ర

ఇంగ్లీషులో : 1. స్ప్రింగ్ ఆఫ్ థాట్స్, 2. గీతామృత్

హిందీలో : 1. అక్షర్ కేతన్, 2. గీతామృత్

కన్నడలో : గరిగళు గీతామృత్

వెబ్‌సైట్ ఆవిష్కరణ : **www.rajyasree.com**

(ప్రముఖుల పరిచయాలు, అందుకున్న బిరుదులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, పురస్కారాలు, చిత్రమాలికల సంపూర్ణంగా 20 పుస్తకాలు సమాహారం)

విదేశాలలో : 1. తానా సభలు - అమరికా (డల్లాస్, యు.ఎస్.ఏ.), 2. లండన్ నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు, 3. సాహిత్య భారతి - న్యూజెర్సీ, 4. 5వ ప్రపంచ తెలుగు సదస్సు - సింగపూర్, 5. మలేషియా తెలుగు సంఘం వారి సత్కారం, 6. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (డల్లాస్, యు.ఎస్.ఏ)

అధ్యక్షులు : కేతవరపు ఫౌండేషన్, హైదరాబాద్

గౌరవాధ్యక్షులు : చేతన సచివాలయ సారస్వత వేదిక, హైదరాబాద్

బిరుదులు : 1. గౌరవ డాక్టరేట్, 2. భారత్ భాషా భూషణ్, 3. ప్రజ్ఞాశ్రీ, 4. సాహిత్యశ్రీ, 5. వేదాంత వక్త, 6. స్త్రీ శక్తి

జీవన సాఫల్య పురస్కారాలు : 1. యునైటెడ్ థియోలాజికల్ రీసర్చ్ యూనివర్సిటీ, 2. సృజన సాహితీ సంస్థ, సత్తుపల్లి,

పురస్కారాలు : 1. డా॥ అక్కినేని స్వర్ణపతక పురస్కారం, 2. శ్రీశ్రీ యక్స్‌లెన్సీ అవార్డు, 3. టంగుటూరి ప్రకాశం పంతులు అవార్డు, 4. మదర్ థెరిస్సా పురస్కారం.